క్లుప్తంగా

మొక్కల సంరక్షణను బాధ్యతతో చేపట్టాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : హరితహారం మొక్కల సంరక్షణను బాధ్యతతో చేపట్టాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ సూచించారు. గురువారం మండలంలోని తిమ్మోజీవాడి గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలో పల్లెప్రకృతి వనం, నర్సరీల నిర్వహణ తీరును, వైకుంఠ దామం, కంపోస్ట్ షెడ్‌లను పరిశీలించారు. జీపీలో రికార్డులను తనిఖీ చేశారు. ఎంపీవో సురేందర్ రెడ్డి, కార్యదర్శి పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ



బీబీపేట : నాబార్డ్ సహకారంతో మండలంలోని తుజాల్‌పూర్‌లో 30 మంది మహిళలకు 15 రోజులుగా మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ అందించారు. వారికి గురువారం జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ ప్రేమ్‌కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం ప్రవీణ్ కుమార్, యూనియన్ బ్యాంకు మేనేజర్ గజానంద్, ఏపీఎం బాలపోచయ్య, కార్యదర్శి ఇంతియాజ్ పాల్గొన్నారు.

విద్యార్థుల స్వయంపాలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని పల్లెబోగుడతండా ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 5వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటివిద్యార్థులకు పాఠాలను బోధించారు. స్వయంపాలనలో భాగంగా పాఠశాల హెచ్‌ఎంగా శ్రీకాంత్, పీఈటీగా గబ్బర్‌సింగ్, టీచర్లు పార్వతి, అశ్విని, నవీన్, నికిత, సింధూ వ్యవహరించారు.

వైస్‌ఎంపీపీకి సన్మానం



రామారెడ్డి : రామారెడ్డి తొలి వైస్ ఎంపీపీ కన్నాపురం ఎంపీటీసీ ముత్తినేని రవీందర్‌రావుపై బుధవారం నిర్వహించిన అవిశ్వాస బలపరీక్ష విగిపోయింది. బలపరీక్షకు బుధవారం పది ఎంపీటీసీలు ఎవరు హాజరు కాకపోవడంతో సభ విశ్వాసం పొందినట్లుగా అధికారులు ప్రకటించారు. అవిశ్వాసం వీగిపోవడంతో కన్నాపూర్ యువకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ రామారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో రవీందర్‌రావును సన్మానించారు.

ప్రణాళికతో చదవాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : త్వరలో జరుగబోయే టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు ప్రణాళికతో చదివితే విజయం తథ్యమవుతుందని ఉత్తునూర్ సింగిల్ విండో చైర్మన్ ప్రభాకర్ రావు అన్నారు. గురువారం మండలంలోని ఉత్తునూర్, వజ్జపల్లి ఉన్నత పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ తరపున విజయస్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కృష్ణాకర్‌రావు, సంతోష్‌కుమార్, హెచ్‌ఎం ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

‘శంకుస్థాపన ఫలకాలు తొలగించారు’



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శంఖుస్థాపన చేసిన శిలాఫలకాలను తొలగించారని విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ గురువారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. ఫోన్ ద్వారా సాక్ష్యాల చిత్రాలను చూపుతూ కలెక్టర్‌కు వివరించారు. క్యాంప్ కార్యాలయం ముఖద్వారం ముందు నిర్మాణ పనుల శంఖుస్థాపన, ప్రారంభోత్సవ ఫలాలను తొలగించి వాటిని భవనం అవతలి వైపు ఉంచారని తక్షణమే వాటిని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సంతాయిపేట్ శివారులో ముస్తాబైన భీమేశ్వరాలయం



ఓంశాంతి భవనంలో పూజలు చేస్తున్న బ్రహ్మకుమారీలు



పట్టణంలోని సుభాష్‌నగర్‌లో పండ్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు



ఎల్లారెడ్డిలోని నీలకంఠేశ్వరాలయం

- మార్కెట్లలో సందడి
- పండ్లు, పూలు, పూజ సామగ్రి కోసం ప్రత్యేక స్టాళ్లు

కామారెడ్డి టౌన్ : మహా శివరాత్రి పండుగను నేడు భక్తులు వైభవంగా జరుపుకోనున్నారు. పండుగకు కావాల్సిన పండ్లు, పూలు, పూజ, ఇతర సామగ్రి కొనుగోలు చేస్తుండటంతో పట్టణంలోని రోడ్లన్ని రద్దీగా మారాయి. పట్టణంలోని సుభాష్‌రోడ్, జేపీఎన్‌రోడ్, సిరిసిల్లారోడ్, కొత్తబస్టాండ్, పాత బస్టాండ్‌లలో పండ్లు, పూలు, దేవుళ్ల చిత్రపటాలు, దొంతులు, మామిడాకులు, పత్రి తదితర పూజా సమాగ్రి విక్రయాల కోసం ప్రత్యేక స్టాళ్లు వెలిసారు. రేట్లు రెండింతలు పెంచడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



జిల్లా కేంద్రంలోని పురాతన శివకేశవ ఆలయం

ఉత్సవాలకు ఏర్పాట్లు..

ఎల్లారెడ్డి/సదాశివనగర్/మద్నూర్: ఎల్లారెడ్డి పట్టణంలోని నీలకంఠేశ్వరాల యం, రాజరాజేశ్వరాలయం, సోమయాజుల శివాలయం, వెల్లుట్లపేట శివారులోని చెనింగ రాజరాజేశ్వరాలయం, తిమ్మాపూర్‌లోని ఉమా సంఘమేశ్వరాలయాలు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. సదాశివనగర్ మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డిలోని వీరభద్రేశ్వర స్వామి ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ వద్ద శివాలయం, మండల కేంద్రంలోని సోమలింగాల ఆలయంలో శుక్రవారం నిర్వహించే శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు.

నాగిరెడ్డిపేటలో ఎడ్లబండ్ల ప్రదర్శనకు ఏర్పాట్లు..



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని తాండూర్ శివారులో త్రిలింగ రామేశ్వరాలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. శనివారం సాయంత్రం ఆలయం వద్ద ఎడ్లబండ్ల ప్రదర్శన చేపట్టనున్నారు.

దుర్కిలో..



బాన్సువాడ : శివరాత్రి ఉత్సవాలకు దుర్కి సోమలింగేశ్వర ఆలయం ముస్తాబైంది. దుర్వాసన మహర్షి (ఆత్రి) ఈ ఆలయంలో ఉంటూ తపస్సు చేసుకునే వాడని ప్రతీత. అందుకే ఈ ఊరికి కూడా దుర్వాసుని పేరు మీదగా దుర్కి అనే పేరొచ్చిందని అంటుంటారు.

భక్తుల కోరికలు తీర్చే స్వయంభూలింగేశ్వరుడు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని సంతాయిపేట్‌లో వెలసిన భీమేశ్వరాలయం వేలాది మంది భక్తుల కోరికలు తీరుస్తోందని భక్తుల నమ్మకం. గ్రామంలో పూర్వం పెద్దఎత్తున సంత జరిగేదని దాని కారణంగానే ఆ గ్రామానికి సంతాయిపేట్ అని పేరు వచ్చిందని గ్రామస్తులు చెబుతున్నారు. 8న మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని 9న అన్నదానం ఉందని ఆలయ కమిటీ పేర్కొంది.

రాముడు కొలిచిన బుగ్గ రామలింగేశ్వరుడు



రామారెడ్డి (ఎల్లారెడ్డి) : మండలంలోని మద్దికుంట అటవీ ప్రాంతంలో శ్రీరాముడు వనవాసంలో భాగంగా ప్రతిష్ఠించి కొలిచిన స్వయంభు బుగ్గ రామలింగేశ్వరుడి ఆలయంలో శివరాత్రి సందర్భంగా కళ్యాణోత్సవం రథోత్సవం నిర్వహించనున్నారు.

దోమకొండలో..



దోమకొండ : దోమకొండలోని శివరాంమందిర్ ఆలయం, గడికోటలోని మహదేవుని ఆలయాలను రంగులు విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. గడికోటలోని మహదేవుని ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని ట్రస్ట్ మేనేజర్ బాబ్జి తెలిపారు.

గృహజ్యోతి బిల్లుల అందజేత

నిజాంసాగర్(జుక్కల్) : ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను సీఎం రేవంత్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు ప్రజా పండరి అన్నారు. గురువారం నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల్లోని ఒడ్డేపల్లి, ముగ్దుంపూర్ జీపీల్లో గృహజ్యోతి జీరోబిల్లు రశీదులను ఇంటింటికీ తిరుగుతూ లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షేక్ మోయిన్, రాధ, సంగమేశ్వర్, నారాయణరెడ్డి, అజయ్‌కుమార్, కాశీరాం, రాజారాం, రాములు, గంగారాం తదితరులున్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : నిరుపేద కుటుంబాలకు వరం గృహజ్యోతి పథకమని ఎంపీటీసీ సాయిబాబా పేర్కొన్నారు. కాస్లాబాద్‌లో గృహజ్యోతిని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు హన్మాండ్లు, హైమద్, సబ్ ఇంజినీర్ సాయినాథ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ముగ్దుంపూర్‌లో గృహజ్యోతి జీరో బిల్లు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



బాన్సువాడ : మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సమక్షంలో హైదరాబాద్‌లో గురువారం బీర్కూర్ మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీర్కూర్ జెడ్పీటీసీ స్వరూప, మాజీ ఏఎంసీ చైర్మన్ ద్రోణవల్లి అశోక్, బైరాపూర్ మాజీ సర్పంచు అంజవ్వ లక్ష్మణ్, బైరాపూర్ సొసైటీ చైర్మన్ రామకృష్ణ, కిష్టాపూర్, అన్నారం మాజీ సర్పంచులు బాబురావు, కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సాయిలు, తిమ్మాపూర్ మాజీ సర్పంచి రాంబాబు, సత్యనారాయణతో పార్టీలో చేరారు.

ఓటుహక్కుపై మహిళలకు అవగాహన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం మహిళాసంఘాల సభ్యులకు ఓటు నమోదు, ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తూ రంగోలి, మెహందీ పోటీలు నిర్వహించారు. ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ మహిళాసంఘాల సభ్యులు ముగ్గులు వేయడంతో పాటు మెహందీ డిజైన్లు వేసి పోటీల్లో పాల్గొన్నారు. కాగా రంగోలి పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. మండల సమాఖ్య పాలక వర్గ సభ్యురాలు లక్ష్మి, సీసీలు నారాయణ, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, డీఎంజీ సంగమేశ్వర్, అకౌంటెంట్ రాజు, ఆపరేటర్ రవి తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఓటుహక్కు వినియోగించుకోవాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : అర్హులైన వారందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏపీఎం రవీందర్ అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. గ్రామాలలో 18ఏళ్లు నిండిన వారుంటే ఓటు నమోదు చేసుకునేలా చూడాలని, అలాగే 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా కృషి చేయాలన్నారు. ముగ్గుల పోటీలు, మెహెందీ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య కోశాధికారి రవనీల, సీసీలు, వీవోఏలు, మహిళా సంఘాల సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఏపీఎం జగదీశ్



నిజాంసాగర్ కస్తూర్బా సిబ్బందికి చీరలు అందజేస్తున్న ఎంఈవో దేవిసింగ్



ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో..



ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో..



గాంధారి మండల పరిషత్ కార్యాలయంలో..

ఘనంగా మహిళలకు సత్కారం

నియోజకవర్గాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సదాశివనగర్‌లోని ఐకేపీ కార్యాలయంలో ముగ్గులు వేస్తున్న సిబ్బంది



తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో..



భిక్కనూరులో..



నాగిరెడ్డిపేటలో..



కాచాపూర్ సచివాలయంలో..



బీబీపేటలో..



రాజంపేటలో..

ఆధ్యాత్మికం

శివపార్వతుల కల్యాణోత్సవం



కామారెడ్డి అర్బన్ : మహాశివరాత్రి సందర్భంగా గురువారం పట్టణ పరిధిలోని దేవునిపల్లి శివాలయంలో గ్రామాభివృద్ధి కమిటీ, శివభక్త కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. శివపార్వతుల విగ్రహాలను గ్రామంలోని ప్రధానవీధుల గుండా ఊరేగించిన అనంతరం ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శివదీక్ష మాలధారులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా విశ్వనాథేశ్వరస్వామి వార్షికోత్సవాలు



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి విద్యానగర్ శ్రీవిశ్వనాథేశ్వరస్వామి ఆలయం నాల్గో వార్షికోత్సవం సందర్భంగా గురువారం మహాగణపతికి 1121 గరికల దండ, వేయి గులాబీలతో పుష్పాలంకరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు శంకర్‌గౌడ్, మోహన్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

12న తైబజార్ వేలం

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో వారాంతపు సంత, డైలీ మార్కెట్, పశువుల దాఖలాకు సంబంధించి ఈనెల 12న తైబజార్ వేలం పాట నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారాంతపు సంతకు రూ. లక్ష, రోజువారి సంతకు రూ. 75 వేలు, పశువుల దాఖలాకు రూ. 50 వేల డిపాజిట్‌తో పాటు రూ. 5వేల డొనేషన్ ఫీజు చెల్లించిన వారికి తైబజార్ వేలంలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని ఉత్తునూర్‌కు చెందిన ఓ యువకుడు యాచారానికి చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్న అనంతరం వారు సదాశివనగర్ సర్కిల్ కార్యాలయానికి చేరుకున్నారు. అమ్మాయి తల్లిదండ్రులు అబ్బాయిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాగా ఇరువర్గాలతో పోలీసులు చర్చించి అమ్మాయిని కౌన్సెలింగ్ నిమిత్తం సఖీ సెంటర్‌కు తరలించారు.

భీంరావు మహరాజ్‌కు స్వాగతం



భిక్కనూరు : మండలంలోని బస్వాపూర్ వద్ద మాదిగ జాగృతి సంఘం నేతల భీంరావు మహరాజ్‌కు పాదయాత్రకు గురువారం ఘనస్వాగతం లభించింది. ఈ సందర్భంగా భీంరావు మహరాజ్ మాట్లాడుతూ మాదిగ జాతిని జాగృతం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. జాంబవంతుడి స్ఫూర్తితో ఈ పాదయాత్ర చేపట్టానని మాదిగ కులస్తుల ఐక్యతకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరిస్తూ పాదయాత్రను నిర్వహిస్తున్నానన్నారు. అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు శాంతికుమార్, నేతలు తుడుం స్వామి, బాబు, భిక్షపతి, జీవన్, కిరణ్, దయాకర్ పాల్గొన్నారు.

మహిళలకు రక్తదానం

కామారెడ్డి అర్బన్ : తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్న ఇద్దరు మహిళలు వనజ, పోశవ్వకు గురువారం ఏబీ పాజిటివ్, ఏ పాజిటివ్ రక్తం అందజేసినట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయబాలరాజు, నూర్‌సింగ్, జీవన్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

మద్నూర్(జుక్కల్) : మండలంలోని మేనూర్ మోడల్ కళాశాలలో, మద్నూర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం మద్నూర్‌లోని కళాశాలలో 108 మంది హాజరయ్యారని, మేనూర్ మోడల్ పరీక్ష కేంద్రంలో 67 మంది హాజరయ్యారని ఇద్దరు గైర్హాజరయ్యారని సీఎస్ జ్యోతి తెలిపారు.

మహిళలకు రిజర్వేషన్ కల్పించాలి

కామారెడ్డి టౌన్ : చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ రమ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మున్నూరుకాపు సంఘ భవనంలో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఆమే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర నాయకుడు పాలడుగు సుధాకర్, జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ తదితరులున్నారు.